# మావోయిస్టుల ఘాతుకానికి మహిళ బలి

### మందుపాతర పేలి గ్రామస్తురాలి మృతి


మృతిచెందిన సుశీల సోధి

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 30: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టుల ఘాతుకానికి ఓ మహిళ బలైన ఘటన బీజాపూర్ జిల్లాలో ఆదివారం జరిగింది. బీజాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోధీ పారాకు చెందిన సుశీల సోధి ఇప్ప పువ్వు కోసు కొచ్చేందుకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు బొట్టమర్కాలోని కొండ ప్రాంతానికి వెళ్లింది. ఈ క్రమంలో జవాన్లను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై సుశీల అడుగు వేయడంతో అది విస్ఫోటనం చెంది తీవ్రంగా గాయపడింది. ఇది గమనించి గ్రామస్తులు అక్కడికి చేరుకుని సుశీలను హుటాహుటిన ఉసూర్ దవాఖానకు తరలించారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే సుశీల మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు

- ఆ మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు
- పట్టించుకోని ఎన్‌హెచ్, పోలీసు అధికారులు


పెనగడప వద్ద మూలమలుపు

చుంచుపల్లి, మార్చి 30 : అది విజయవాడ- జగదల్‌పూర్ జాతీయ రహదారి-30. చుంచుపల్లి మండలం పెనగడప వద్ద ప్రమాదం జరిగిందంటే చాలు.. ముందుగా ఆ ప్రాంతంలో ఉండే ఎవ్వరైనా మహాలక్ష్మి ఆలయం ఎదుటనేనా అని మాట్లాడుకోవడం పరిపాటి. అంటే ఆ ప్రాంతంలో ఎన్ని ప్రమాదాలు జరుగుతాయో దీనిని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ఆ మూలమలుపు వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో పడి ఎంతోమంది వాహనదారులు క్షతగాత్రులయ్యారు. ప్రాణాలు సైతం కోల్పోయారు. ఎన్‌హెచ్ రహదారి కింద భాగంలో పంచాయతీకి సంబంధించిన పైపు లైన్ ఉండటం.. ఆ పైపులైన్ లీకేజీతో రహదారిపై గుంత ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ గుంతను తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారానికి ఎన్‌హెచ్ అధికారులు పూనుకోవడంలేదు. దీంతో ఇటీవల ఓ ఆటోడ్రైవర్ గుంతను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని మృతిచెందిన ఘటన విదితమే. అయినా ఇప్పటివరకు ఎన్‌హెచ్ అధికారులు స్పందించిన పాపానపోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

నిత్యం ప్రమాదాలు జరుగుతున్న మూలమలుపుల వద్ద వేగ నియంత్రణ కోసం స్పీడ్ బంపర్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అధికారులకు టోల్‌ట్యాక్స్ వసూళ్ల మీద ఉన్న శ్రద్ధ, ప్రమాదాలను నివారించడంలో కనిపించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారిపై గుంతలు ఉన్నా పూడ్చేవారు లేరు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు జనావాసాలకు దూరంగా నిర్మించడంతో అవి నిరుపయోగంగా, తుమ్మ వనాలుగా మారాయి. జాతీయ రహదారి పక్కన తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి రహదారిపైకి వచ్చి ద్విచక్ర వాహనదారులకు కండ్లకు తగులుతున్నాయి.


నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

**శాశ్వత పరిష్కారం చూపాలి..**



మహాలక్ష్మి గుడి మూలమలపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలో పంచాయతీకి వెళ్లే పైపులైను లీకై గుంత ఏర్పడి ప్రమాదానికి నిలయంగా మారింది. ఆ గుంతను తాత్కాలికంగా పూడుస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చేయడం లేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**– గోరెబాబు, చికెన్‌షాపు వ్యాపారి, పెనగడప**

**బస్ షెల్టర్లను పునఃరుద్ధరించాలి**



నేషనల్ హైవే వారు నిర్మించిన బస్ షెల్టర్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. అవి జనావాసాలకు దూరంగా ఉండటంతో ప్రయాణికులు కూర్చొనే బల్లాలు పూర్తిగా తుప్పు పట్టి శిథిలావస్థకు చేరి పాడైపోతున్నాయి. వీటిని జనావాసాల వద్ద ఏర్పాటుచేస్తే ఉపయోగకరంగా ఉంటాయి. రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా తుమ్మమొక్కలను తొలగించాలి.

**– ముగితే కరుణాకర్, పెనగడప నివాసి**

# ఖమ్మంలో క్రైస్తవుల భారీ ర్యాలీ


ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

రఘునాథపాలెం, మార్చి 30 : పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతి పట్ల ఖమ్మంలో క్రైస్తవులు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి ఎస్‌ఆర్ బీజీఎన్‌ఆర్ కళాశాల వరకు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జోక్యం చేసుకొని ప్రవీణ్ మృతికి కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో సేవకులు జెకర్యా, హనుమంతరావు, రమేశ్‌బాబు, ఆనంద్, విజయ్‌కుమార్, డేవిడ్, శేఖర్‌బాబు, తిమోతి, వేముల సత్యం, బాలస్వామి, కృష్ణమోహన్, మంద సంజీవరావు, పీటర్, రవికిరణ్, రాజు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- రామయ్యకు ఉత్సవాంగ స్నపనం
- తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం
- శోభాయమానంగా 'భద్రాచలం'

భద్రాచలం/ పర్ణశాల, మార్చి 30: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి వసంతపక్ష తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినమైన ఆదివారం అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పవిత్ర గోదావరీ జలాలను తీర్థబిందెతో తెచ్చి నిత్యకల్యాణ మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష అర్చన, ఉగాది ప్రసాద నివేదన చేశారు. అలాగే, బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే రుత్వికులకు దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్ దీక్షావస్త్రాలను అందజేశారు. అలాగే, మూలవరులకు అభిషేకం, నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి ఉత్సవాంగ స్నపనం గావించారు. దీంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం శ్రీ సీతారామచంద్రమూర్తులను స్థానిక గోవిందరాజస్వామి వారి ఆలయం (తాతగుడి)లో తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా మత్స్యం గ్రహణం నిర్వహించారు. అనంతరం మట్టిని సేకరించి కల్యాణ అంకురార్పణకు వినియోగించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భద్రాచలం పట్టణం శోభాయమానమైంది. సాయంత్రం జరిగిన పంచాంగ శ్రవణంలో 'రాములవారి ఆదాయం 8, వ్యయం 2, రాజపూజ్యం 7, అవమానం 3, అలాగే, సీతమ్మ ఆదాయం 14, వ్యయం 2, రాజపూజ్యం 6, అవమానం 6' అంటూ అనుగ్రహ భాషణం చేశారు. అలాగే, పర్ణశాల రామాలయంలోనూ బ్రహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గోదావరి నది నుంచి తీర్థబందె ద్వారా పవిత్ర జలలాలను తీసుకొచ్చి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ గావించారు.


సహస్రధారాభిషేకం నిర్వహిస్తున్న అర్చకస్వాములు



పర్ణశాలలో గోదావరి నుంచి తీర్థ బిందెను తీసుకొస్తున్న అర్చకులు, భద్రాద్రిలో ఊరేగుతున్న స్వామివారు

# ఎన్నాళ్లిలా ?

- మున్సిపాలిటీ పాలనకు రెండు నెలలు పూర్తి
- ఇంకా ఖరారు కాని వార్డుల విభజన ప్రక్రియ
- పాత కార్యదర్శులతోనే పురపాలక నిర్వహణ
- ఏఈలు, డీఈ, టీపీఎం, సిబ్బంది కరువు

ఖమ్మం రూరల్, మార్చి 28: పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం కావడం, తరువాత మళ్లీ మున్సిపాలిటీ నుంచి తరిగి పంచాయతీలుగా రూపాంతరం చెందడం వంటి ప్రక్రియలు ఖమ్మం రూరల్ మండలంలో కొన్నేళ్లుగా జరుగుతున్నాయి. అయితే, అదే తరహాలో ఈసారి ఏకంగా మండలాన్ని పూర్తిగా విభజించి గతంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)లో విలీనమైన గ్రామాలతోపాటు మరిన్ని గ్రామాల సమూహంగా ఏదులాపురం మున్సిపాలిటీని ప్రభుత్వం ప్రకటించింది. ఆ పురపాలక సంఘం ఏర్పాటై సరిగ్గా రెండు నెలలు దాటింది. ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా, ఏదులాపురం, ముత్తగూడెం, గొల్లగూడెం, బారుగూడెం, మద్దులపల్లి, తెల్దారుపల్లి, వెంకటగిరి, గుదిమళ్ల, గుర్రాలపాడు, పల్లెగూడెం, పోలేపల్లి (కొంతభాగం) పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేసింది. తొలుత ఏదులాపురం పంచాయతీ కార్యాలయాన్ని మున్సిపాలిటీ కార్యాలయంగా అధికారులు ప్రకటించారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లాను ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించింది. అతడితోపాటు మరో నలుగురు ఉద్యోగులను సైతం ఇన్‌చార్జి హోదాలో నియమించింది. అనంతరం వారం రోజులపాటు హడావిడి చేసిన అధికారులు.. బీఎల్‌వోలు, ఇతర సిబ్బంది సహాయంతో డివిజన్ల ఏర్పాటు ప్రక్రియ చేపట్టారు. ఇన్‌చార్జి కమిషనర్ షఫీ ఉల్లా పక్షం రోజులకే తిరిగి ఖమ్మానికే పరిమితమయ్యారు. ఆయన స్థానంలో గతంలో పెద్దతండా పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసిన సీనియర్ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఏదులాపురం ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమితులయ్యారు. అయితే, గతంలో కేఎంసీ ఉద్యోగులు సైతం నాలుగైదు రోజులకు ఒకసారి చుట్టపుచూపుగా వస్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో గతంలో పంచాయతీల సెక్రటరీతోనే మున్సిపల్ కార్యకలాపాల నిర్వహణ కొనసాగుతోంది. వారు సైతం ఇప్పటి వరకు అధికారికంగా మున్సిపాలిటీలో విలీనంకాని పరిస్థితి నెలకొంది.

**అధికారులు, సిబ్బంది లేకుండానే నిర్వహణ..**

మున్సిపల్ నిర్వహణలో అనేక విభాగాల అధికారులు, ఉద్యోగుల పాత్ర చాలా కీలకం. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, ఏఈలు, డీఈ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. ఇలా అనేక సెక్షన్లకు బాధ్యుల నియామకం జరిగేతేనే పౌర సేవలకు ఎలాంటి విఘాతం లేకుండా పాలన సాఫీగా సాగుతుంది. కానీ, ప్రస్తుతం మున్సిపాలిటీకి ఒక్కరంటే ఒక్క ఉద్యోగి, అధికారులను కేటాయించని పరిస్థితి. మున్సిపాలిటీ ఏర్పాటు జరిగి సరిగ్గా రెండు నెలలైనా పౌరసేవలు అందుబాటులోకి రాకుండాపోయాయి. ఇంతవరకు పంచాయతీ సెక్రటరీలుగా విధులు నిర్వహించిన ఉద్యోగులు మున్సిపాలిటీ సేవల్లో పాల్పంచుకుంటున్నారు. అయితే, వారికి మున్సిపల్ పాలనపై ఏమాత్రం అవగాహన లేకపోవడంతో కమిషనరే స్వయంగా అన్ని రకాల విధులు నిర్వహిస్తున్నారు.

**ఏ డివిజన్ ఎక్కడుందో?**

మొత్తం 33 వార్డులతో కూడిన మున్సిపాలిటీని ఏర్పాటుచేసినట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అందుకు అనుగుణంగా రెండు మూడు రోజులపాటు అంగన్‌వాడీ, ఇతర సిబ్బంది సహాయంతో వార్డుల విభజన ప్రక్రియను చేపట్టారు. తరువాత ఏం జరిగిందో ఏమో.. వార్డు విభజన మాత్రం జగరలేదు. ప్రస్తుతం ఆయా గ్రామాల ప్రజలకే కాదు.. కనీసం అధికారులకు కూడా ఏ వార్డు ఎక్కడ ఉందనే అంశంపై స్పష్టత లేదు.



# రాబడి

# ఈ 5 పోస్టాఫీస్ స్కీములతో పన్ను లాభం

**తపాలా** శాఖ నుంచి వచ్చే చిన్న మొత్తాల పొదుపు పథకాలను.. దేశంలోనే అత్యంత సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా చెప్పవచ్చు. ఇందుకు కారణం భారత ప్రభుత్వం భరోసా ఉండటమే. పైగా ఆయా స్కీముల్లో పెట్టుబడులపై, వాటిద్వారా పొందే ఆదాయంపై ఆదాయ పన్ను చట్టం-1961లోని సెక్షన్ 80సీ కింద మదుపరులకు పన్ను మినహాయింపులూ వర్తిస్తాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలదాకా క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇలాంటి ఐటీ ప్రయోజనాలున్న 5 పోస్టాఫీస్ స్కీములను ఒక్కసారి పరిశీలిస్తే..

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)**

అత్యంత ప్రజాదరణ పొందిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకాల్లో పీపీఎఫ్ ఒకటి. కనీస పెట్టుబడి రూ.500. గరిష్ఠం ఏటా రూ.1.5 లక్షలు. పీపీఎఫ్‌పై వడ్డీరేటు ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి 7.1 శాతం. పీపీఎఫ్‌లో డిపాజిట్లకు, దానిపై పొందే వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలను తీసుకున్నా ఎలాంటి పన్నులూ ఉండవు.

**నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ (ఎన్ఎస్‌సీ)**

ఎన్ఎస్‌సీ అనేది ఓ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం. దీనిద్వారా గ్యారంటీడ్ ఆదాయం, ట్యాక్స్ సేవింగ్స్ రెండూ ఉంటాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను వడ్డీరేటు 7.7 శాతం. మెచ్యూరిటీపై పొందవచ్చు. ఇక ఈ స్కీంలో కనీసం రూ.1,000, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. ఎన్ఎస్‌సీ కాలపరిమితి ఐదేండ్లు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి. అయితే పన్ను ప్రయోజనాల కోసం తొలి నాలుగేండ్లలో రీఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

**సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై)**

ఆడపిల్లల కోసం ఉద్దేశించిన పథకమే ఈ ఎస్ఎస్‌వై. ఇందులో పన్ను ప్రయోజనాలతో కూడిన అధిక రాబడులుంటాయి. కనీసం రూ.250, గరిష్ఠంగా ఏటా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడిగా పెట్టవచ్చు. పెట్టుబడికి, వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలకు పన్నులుండవు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతంగా ఉన్నది. వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తారు. ఏటేటా చక్ర వృద్ధిని అనుసరించి లాభాల్ని అందిస్తారు.

**సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్)**

వృద్ధులను ఉద్దేశించి తెచ్చిన పథకం ఇది. ఎస్‌సీఎస్ఎస్‌లోనూ పన్ను ప్రయోజనాలతో కూడిన లాభాలుంటాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠ పెట్టుబడికున్న పరిమితి రూ.30 లక్షలు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయానికి పన్నుంటుంది. ఈ ఏప్రిల్-జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతం.

**ఐదేండ్ల పోస్టాఫీస్ టైం డిపాజిట్ (పీవోటీడీ)**

ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్ఠంగా ఎంతైనా పెట్టుకోవచ్చు. వడ్డీ ఆదాయానికి పన్నులు వర్తిస్తాయి. రూ.1.5 లక్షల దాకా పెట్టుబడులకు పన్ను మినహాయింపులుంటాయి. అయితే ఐదేండ్లలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే పన్ను ప్రయోజనాలు వర్తించవు. ఈ ఏప్రిల్-జూన్‌కిగాను వడ్డీరేటు 7.5 శాతం. మూడు నెలలకోసారి లెక్కించి ఏడాదికోసారి చెల్లిస్తారు.





# గోల్డ్ vs నిఫ్టీ50

## దీర్ఘకాల పెట్టుబడికి ఏది ఉత్తమం?

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ర్యాలీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలకు గొప్ప లాభాలనే అందించింది. ఒక్క వారంలోనే సుమారుగా సెన్సెక్స్ 4.35 శాతం, నిఫ్టీ 4.45 శాతం చొప్పున ఎగిశాయి మరి. అయితే ఇన్వెస్టర్స్ పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులను ఎంచుకోవడానికి లేదా పెంచుకోవడానికి ఇది చాలదు. ఎందుకంటే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా అంటే జనవరి-మార్చిలో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఇంచుమించుగా 1 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం, వెండి ధరలు దాదాపు 17 శాతం, 15 శాతం మేర పెరిగాయి. ఇంకా లోతుగా చెప్పాలంటే జనవరి 1న సెన్సెక్స్ 78,139.01 పాయింట్ల వద్ద మొదలైంది. ఇప్పుడిది 77,414.92 పాయింట్ల వద్ద ఉన్నది. అలాగే నిఫ్టీ 23,644.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. ఫలితంగా సెన్సెక్స్ 724.09 పాయింట్లు, నిఫ్టీ 125.45 పాయింట్లు కోల్పోయినట్టైంది. కానీ బంగారం ధర రూ.78,950 నుంచి రూ.92,150కి ఎగబాకింది. వెండి ధర రూ.89,700 నుంచి రూ.1,03,000లకు చేరింది. దీంతో గోల్డ్, సిల్వర్ రేట్లు గడిచిన 3 నెలల్లో రూ.13,200, రూ.13,300 చొప్పున ఎగిసినట్టైంది.

**ఇదీ సంగతి..**

పైన చెప్పుకున్న లెక్కలన్నీ స్వల్పకాలిక పెట్టుబడి ఆధారిత గణాంకాలే. కానీ మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది దీర్ఘకాలిక పెట్టుబడికి ఏది ఉత్తమం? అన్నదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలు.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. దీంతో మెజారిటీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు స్టాక్ మార్కెట్ సూచీలను దిగువకు, గోల్డ్, సిల్వర్ సూచీలను ఎగువకు పంపాయి. ఇక భారత్ విషయానికొస్తే.. బంగారాన్ని సురక్షిత మదుపు సాధనంగా భావిస్తుంటే, బ్రాడర్ ఈక్విటీ మార్కెట్‌కు, దేశ ఆర్థిక ప్రగతికి నిఫ్టీనే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి మదుపరుల పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్ అనేవి ఇక్కడ కీలకం అని గుర్తుంచుకోవాలి. వాటి ప్రకారం..

**దీర్ఘకాల రాబడులు**

గడిచిన రెండు దశాబ్దాల్లో దేశీయంగా మదుపరులకు బంగారంపై పెట్టుబడులు 8-10 శాతం మేర చక్ర వార్షిక వృద్ధిరేటును అందించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ పసిడిపై మదుపు ఆకర్షణీయ ప్రదర్శననే ఇచ్చింది. అయితే దీర్ఘకాలంలో నిఫ్టీలో పెట్టుబడులు 12-15 శాతం వరకు చక్ర వార్షిక వృద్ధిరేటును చూపాయి. దీంతో వృద్ధికే మీ ప్రాధాన్యత అయితే నిఫ్టీ పెట్టుబడులే లాభదాయకం.

**ద్రవ్యోల్బణం సవాళ్లు**

ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలంటే బంగారం చక్కని సాధనం. కరెన్సీ విలువ తగ్గితే ఇది పెరుగుతుంది. ఇక స్టాక్ మార్కెట్లు సైతం ద్రవ్యోల్బణాన్ని మించి పరుగులు పెడుతున్నాయి. కంపెనీల లాభాలు, ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో నిఫ్టీదే పైచేయి.

**ఒడిదుడుకులు**

పుత్తడి ధరల్లో ఒడిదుడుకులు తక్కువే. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభాల ప్రభావం పెద్దగా ఉండదు. స్టాక్ మార్కెట్లపై ప్రతీ చిన్నదాని ప్రభావం కనిపిస్తుంది. అయినా త్వరగా కోలుకుంటాయి. స్థిరత్వాన్ని కోరుకునే మదుపరులకు బంగారమే ఉత్తమం. అయితే ఒడిదుడుకులను తట్టుకుని, ఓపిగ్గా ఎదురుచూస్తే నిఫ్టీ లాభం.

**ద్రవ్య లభ్యత**

భౌతిక బంగారాన్ని నగదుగా మార్చుకోవడం కొంత ఇబ్బంది. నాణ్యత, తయారీ ఇతరత్రా ఖర్చులు ఎదురవుతాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈ సమస్య ఉండదు. స్టాక్ మార్కెట్లలో షేర్ల క్రయవిక్రయాలు సులభం. నగదు లభ్యత వేగంగానే ఉంటుంది. కాబట్టి పసిడి కంటే నిఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్స్‌నే త్వరగా క్యాష్ చేసుకోవచ్చు.

**పోర్ట్‌ఫోలియో**

బంగారం ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గిస్తుంది. కానీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. అయితే దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలే సరైనవని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ మాట.

**చివరగా..**

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి తమ పోర్ట్‌ఫోలియోల్లో స్థిరత్వాన్ని కోరుకునే భారతీయ మదుపరులకు బంగారంపై పెట్టుబడులే ఉత్తమం. అయితే పోర్ట్‌ఫోలియోల్లో వేగవంతమైన వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీలే నయం. అయితే నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత లాభదాయకం.

# ఆటో, జీఎస్టీ గణాంకాలు కీలకం!



మార్కెట్ పల్స్


**దేశీయ** స్టాక్ మార్కెట్లు గత వారం పడుతూ, లేస్తూ కొనసాగినా లాభాలనైతే నిలబెట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) ఆఖర్లో పెట్టుబడులకు ముందుకు రాకున్నా సూచీలు వృద్ధినే కనబర్చాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 509.41 పాయింట్లు లేదా 0.66 శాతం లాభపడి 77,414.92 వద్ద ఆగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 168.95 పాయింట్లు లేదా 0.72 శాతం పెరిగి 23,519.35 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరుల పెట్టుబడులు ఫిబ్రవరి ఆటో అమ్మకాలు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) గణాంకాల ఆధారంగా కొనసాగే వీలున్నట్టు మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కీలకమని గుర్తుచేస్తున్నారు. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఎఫ్ఐఐ పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,800-24,000 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

***గమనిక..***

***స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.***

## ఆరోగ్య బీమా..

# ఓ స్మార్ట్ పెట్టుబడి




**నేడు** వైద్య ఖర్చులు ఏ స్థాయిలో పెరిగిపోయాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి అంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం.. మీ కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఇక గతంతో పోల్చితే ప్రస్తుతం అందుబాటులో ఉంటున్న ఆరోగ్య బీమా పాలసీలు.. కేవలం దవాఖానల్లో చేరికలకేగాక, ఓపీడీ సంప్రదింపులు, టెలీ మెడిసిన్, ముందస్తు వైద్య పరీక్షలు, ప్రసూతి, మానసిక, రిహాబిలిటేషన్, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్నీ అందిస్తుండటం విశేషం. నిజానికి మారిన జీవనశైలితో ఇప్పుడు చాలా మంది వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. గుండె-కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదాలబారిన కూడా పడుతున్నారు. దీంతో ఇలాంటివారికి ఆరోగ్య బీమా, ప్రధానంగా క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లుండే పాలసీల అవసరం చాలా ఉంటున్నది. ఇలాంటి కవరేజీలను ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సహా అనేక సంస్థలు ప్రభావవంతంగా అందిస్తున్నాయి. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు. 60 ఏండ్ల లోపువారికి ఏటా రూ.25,000దాకా, ఆపై వయసున్న సీనియర్ సిటిజన్లకు రూ.50,000 వరకు పన్ను మినహాయింపులను పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ఈ ఉగాదితో మొదలైన కొత్త ఏడాదిలో ఆరోగ్య బీమా ఆవశ్యకతను గుర్తించి ఓ సానుకూల నిర్ణయం తీసుకోండి. ఒకవేళ ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్నట్టైతే.. సమగ్ర కవరేజీలుండే, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే మరింత మెరుగైన బీమాను కొనడం ఉత్తమం.

